సాక్షి ఒడిశా

మంగళవారం । 15 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,22,620లు, బంగారం 4 గ్రాముల 50మిల్లీగ్రాములు, వెండి 30 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నిరసనల ప్రకంపన

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థినిక న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. - 8లో



అగ్ని ప్రమాదం

పారాదీప్ కూరగాయల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఏడు దుకాణాలు దగ్ధమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు అమలు



నో పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనం

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలో మార్కెట్ జంక్షన్ వద్ద ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నారు. సోమవారం ఉదయం శ్రీరామ మందిరం సమీపంలో నో పార్కింగ్ వద్ద బైక్ పెట్టిన వాహనదారుడి ఫొటో తీసి వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. రథయాత్ర నుంచి జిల్లా ఎస్పీ, సబ్ కలెక్టర్ పట్టణంలో జనసందోహం కలిగిన మార్కెట్, హైస్కూల్ జంక్షన్, ప్యాలస్ వీధి, పాతఅగ్నిమాపక దళం వద్ద ఒన్ వే ట్రాఫిక్ అమలు చేసిన తరువాత పర్లాకిమిడి వాహన చోదకులకు కనువిప్పు కలిగింది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తున్నారు.

స్కూటీ డిక్కీలో పాము



స్కూటీ డిక్కీ నుంచి పామును చాకచక్యంగా పట్టుకున్న ప్రదీప్

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్ రెస్టారెంట్ వద్ద ఆగి ఉన్న ఓ స్కూటీలో పాము హల్‌చల్ చేసింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి రెస్టారెంట్‌లో ఉన్న కొందరు పాము డిక్కీలో దూరడం చూసి కేకలు పెట్టారు. వెంటనే పాములు పట్టే ప్రదీప్ సేనాపతికి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న సేనాపతి సుమారు గంటన్నర సమయం కష్టపడి పామును పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


ఆగస్టు నుంచి గోధుమల సరఫరా



జయపురంలో గోడౌన్‌లో నిల్వఉన్న గోధుమ బస్తాలు

జయపురం: పది నెలల కిందట నిలిచిపోయిన గోధుమల సరఫరాను ప్రభుత్వం పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆగస్టు ఒకటో తేదీ నుంచి రేషన్ కార్డు లబ్ధిదారులకు గోధుమలను సరఫరా చేయనున్నారు. ఆ మేరకు జయపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డీలర్లు గోధుమలను లబ్ధిదారులకు సరఫరా చేయాలని జిల్లా పౌర విభాగ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ సమయంలో 2020–21లో పీడీఎస్ గోధుమలను లబ్ధిదారులకు నిలిపి వేశారు. అయితే 2024లో నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత గోధుమలు సరఫరా చేయటం ప్రారంభించారు. 2024 అక్టోబర్ నుంచి కొరాపుట్ జిల్లాలో ప్రతి వ్యక్తికి ఒక కేజీ గోదుమలతో పాటు నాలుగు కేజీల బియ్యం ఇచ్చేవారు. అయితే హఠాత్తుగా ఏ కారణం చేతనో ప్రభుత్వం గోధుమల సరఫరా నిలిపి వేసింది. ఆనాటి నుంచి గోధుముల నిల్వలు ఉన్నా డీలర్లు సరఫరా నిలిపి వేశారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి రేషన్‌కార్డుదారులకు గోధుమలను సరఫరా చేయాలని సివిల్ సప్‌లై అధికారులు వెల్లడించారు..

47 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పట్వారి, సబ్ కలెక్టర్ సహోట

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి సమావేశం హాల్‌లో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముంపో, గుణుపూర్ ఐటీడీఏ అధికారి అజయ్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. గుడారి సమితి పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి కలెక్టర్ పట్వారి 47 వినతులను స్వీకరించారు. వీటిలో 38 వ్యక్తిగత, తొమ్మిది సామూహిక గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఈ సందర్భంగా పది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 88 వేల రూపాయలను కలెక్టర్ అందజేశారు. గ్రామ సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

శ్రావణం.. ఈశ్వరాభిషేకం



ఘోఘరేశ్వరుని దేవస్థానం ఆవరణలో అర్ధరాత్రి బోల్ భం దీక్షకులు

రాజ్‌గంగ్‌పూర్ ఘోఘరేశ్వరుడు



బొడొ సింగారం అలంకరణలో కటక్ అఠొగొడొ ధవళేశ్వరుని దర్శనం

భువనేశ్వర్: శివ భక్తులకు శ్రావణ మాసం అత్యంత పవిత్రప్రదం. ఈ నెల పొడవునా ప్రతి సోమవారం ఇష్ట ఆరాధ్య దైవం మహా దేవుడు శివునికి పవిత్ర జలంతో అభిషేకించి తరించేందుకు దీక్ష బూనుతారు. తొలి శ్రావణ సోమవారం పురస్కరించుకుని రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాలు శివ దీక్ష భక్తులతో కిటకిటలాడాయి. కఠోర నియమ నిష్టలతో ఒక చోటులోని నదీ జలం సేకరించి వేరొక చోట పూజలందుకుంటున్న మహా దేవునికి అభిషేకిస్తారు. నదీ తీరంలో శుచిగా స్నానం ఆచరించి దీక్ష వస్త్ర ధారణతో తీరంలో లాంచనంగా పూజాదులు నిర్వహించి పవిత్ర నదీ జలంతో నింపిన కలశాల్ని కావడికి అమర్చి పాద యాత్ర ప్రారంభిస్తారు. ఈ దీక్షకుల్ని కావడి ధారులు (కొడియా)గా పేర్కొంటారు. పాద యాత్ర ఆద్యంతాలు దీక్ష నియమ నిబంధనల్ని కఠోరంగా అవలంభిస్తారు. సోమవారం శైవ క్షేత్రం చేరేలా యాత్ర కొనసాగిస్తారు. భోలా శంకరుని కటాక్షం కోసం బోల్ భం నిరంతర శివ నామ నినాదంతో ముందుకు సాగుతారు. బోల్ భం దీక్షకుల ఆగమనం పరిసరాల్ని శివ మయం చేస్తాయి. శైవ క్షేత్రాలు ప్రత్యేకంగా అలంకరించుకుని వీరికి స్వాగతం పలుకుతాయి. దారి పొడవునా కావడిధారి పాదచారులకు ఎటువంటి అసౌకర్యం అవాంతరం కాకుండా పోలీసు, రవాణా తదితర అనుబంధ వర్గాలు అంకిత భావంతో చేయూతనిస్తాయి. పలు స్వచ్ఛంధ సేవక వర్గాలు దారి పొడవునా దీక్షకు అనుగుణంగా వీరి కోసం ఏర్పాట్లు చేసి ఆదరిస్తారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి శైవ క్షేత్రాలు విద్యుద్దీపాలు, పచ్చని తోరణాలు, సుగంధిత పూల మాలల అలంకరణతో కనులు మిరమిట్లు గొలిపేలా ముస్తాబవుతాయి. అయా క్షేత్రాల్లో బోల్ భం దీక్షకులు సులభంగా మహా దేవునికి అభిషేకించేందుకు తాత్కాలిక బారికేడ్ల గుండా వరుస క్రమంలో దర్శన సౌకర్యం వంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించి దేవస్థానం యంత్రాంగం సహకరిస్తారు. ఏకామ్ర క్షేత్రంలో లింగరాజు, అఠొగొడొ ధవళేశ్వరుని దేవస్థానం, రాజ్‌గంగ్‌పూర్‌లోని ఘోఘరేశ్వర్, ఢెంకనాల్ కపిలేశ్వర్ మరెన్నో ప్రముఖ శైవ క్షేత్రాలు బోల్ భం దీక్షకుల ఆగమనంతో శ్రావణ శోభతో కళకళలాడుతున్నాయి. ఈ సందర్భంగా మహా నది, ఉప నదులు, బ్రాహ్మణి, వైతరణి, కువాఖాయి తదితర పవిత్ర నదుల నుంచి సేకరించిన జలాన్ని కావడి భారంతో నిష్ఠతో సంకల్పం మేరకు శైవ క్షేత్రం చేరుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో మహా శివునికి అభిషేకిస్తారు. ఈ దీక్షలో ఆబాల గోపాలం అత్యంత అంకిత భక్తి భావంతో పాల్గొంటారు. శివాలయంలో భక్తులు భారీగా గుమిగూడారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులు, కొడిలు బ్రహ్మణి నది, వేదవ్యాస్ శైవ పీఠం నుంచి నీటిని తీసుకు వచ్చి ఘోఘరేశ్వర్ శివాలయానికి నీటిని సరఫరా చేశారు.



దవళేశ్వరునికి పవిత్ర జలంతో అభిషేకిస్తున్న భక్తులు



పూరీ సాగర తీరంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని మహా దేవుని ఆశీస్సులు కోరుతూ ఆవిష్కరించిన సైకత మహా శివుడు

బోల్ భం భక్తుల సందడి



గర్భగుడిలో గంగాభిషేకం చేస్తున్న భక్తులు



శ్రీచంద్రశేఖర ఆలయంలో భక్తుల దీపారాధన

పర్లాకిమిడి: పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డు సంతపేట వద్ద చంద్రశేఖర ఆలయానికి సోమవారం బోల్ భం భక్తులు క్యూ కట్టారు. పవిత్ర మహేంద్రతనయ నది నుంచి వేకువజామున నదీ జలాలను కావిడలో మోసుకుని వచ్చి చంద్రశేఖర ఆలయం గర్భగుడిలో గంగాభిషేకం చేయించారు. దీంతో శ్రావణ మాసంలో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరుస్తుంది. ఈ నెలలో నాలుగు శ్రావణ సోమవారాలు బోల్ భం భక్తులు అతి నిష్ఠతో మహాదేవునికి పూజలు చేస్తారు.



చంద్రశేఖర ఆలయంలో గిరిప్రదక్షిణలు చేస్తున్న బోల్ భం భక్తులు



ఆలయంలో గిరి ప్రదక్షణలు చేస్తున్న బోల్ భం భక్తులు

పారదేశ్వర దేవాలయ నిర్మాణంపై ప్రత్యేకశ్రద్ధ



సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు



దేవాలయం వద్ద నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: పారదేశ్వర దేవాలయ నిర్మాణ కమిటీ సర్వ సభ్య సమావేశం సోమవారం జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ద్వారకానగర్ సమీపంలో నిర్మితమవుతున్న మందిర ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. మందిర నిర్మాణం కోసం ఇప్పటి వరకు సుమారు రూ. 50 లక్షలు ఖర్చు అయినట్లు కమిటీ సభ్యులు వివరించారు. సుమారు మూడు అడుగుల ఎత్తు ఉండే స్ఫటిక లింగాన్ని పంజాబ్ నుంచి తెప్పించి ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. శివ లింగం ఖర్చు సుమారు రూ. 30 లక్షలు అవుతుందని అంచనా వేశారు. దేవాలయ మిగతా నిర్మాణాలు పూర్తి చేయడానికి మరో రూ. 50 లక్షలు అవుతుందని కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ నిధులు వివిధ సంఘాలు, ప్రముఖులు, ప్రజల నుంచి చందాల ద్వారా పోగు చేసి సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలని సభ్యులు తీర్మానం చేశారు. అలాగే సాయంత్రం నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తన అనుచరులతో వెళ్లి దేవాలయ నిర్మాణ పరిస్థితిని పరిశీలించారు.

ప్రేమికులకు నాగలికి కట్టిన ఘటనపై ప్రభుత్వం చర్యలు



సంఘటన జరిగిన పెద్దిఇటిక గ్రామంలో నారాయణ పట్న ఐఐసీ ప్రమోద్ కుమార్ నాయక్ విచారణ చేస్తున్న దృశ్యం


కొరాపుట్: ప్రేమికులను నాగలికి కట్టి గ్రామంలో ఊరేగించిన ఘటన పై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం రంగం లోనికి దిగింది. కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితి బొరిగి గ్రామ పంచాయితీ పెద్దఇటికి గ్రామంలో జరిగిన ఘటనపై నారాయణ పట్న పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నారాయణ పట్న ఐఐసీ ప్రమెథ్ కుమార్ నాయక్ ఆ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ ప్రజలను విచారణ చేశారు. ఈ విచారణలో అందరి ఆమోదంతోనే ప్రేమికులను ఊరేగించామని గిరిజన పెద్దలు ప్రకటించారు. మరో వైపు ప్రేమ జంట కూడా తమ ఇష్ట ప్రకారమే ఈ శిక్షని అంగీకరించామని ప్రకటించారు. బంధుగాం సమితిలో ఒక మంత్రగత్తె ఇచ్చిన సలహా ప్రకారమే ప్రేమికులకు శిక్ష విధించినట్లు గ్రామస్తులంతా ముక్త కంఠంతో సమాధానమిచ్చారు. వారిద్దరూ ఒకే వంశానికి చెందిన వారు కనుక అన్నా చెల్లెళ్ల అవుతారని, దాని వల్ల గ్రామానికి కీడు జరుగుతుందనే విషయం మంత్రగత్తె చెప్పిందని, ఇలా నాగలికి కట్టి ఊరేగిస్తే దోష పరిహారం జరుగుతుందని చెప్పిందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై కొరాపుట్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత స్పందించారు. ఇలాంటి అనాగరిక చర్యలు అంగీకరించబోమన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వీ.కీర్తి వాసన్ మీడియాతో మాట్లాడారు. ఈ సంఘటన పై ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు.

మానవత్వం మంటగలపొద్దు

రాయగడ: మానవత్వ విలువను మంట గలపవద్దని సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న అన్నారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికిరపాయి పంచాయతీ పరిధిలోని కొంజొమాజొడి గ్రామంలో కొద్ది రోజుల కిందట లక సరక అనే యువకుడు అదే గ్రామానికి చెందిన కొడియా సరకను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వరుసకు పిన్ని కావడంతో ఆమెను వివాహం చేసుకోవడం గ్రామ సంప్రదాయాలకు విరుద్ధమని భావించిన గ్రామస్తులు వారిని నాగలికి కట్టి పొలం దున్నించి హింసించారు. దీనిపై ఆదివారం సబ్ కలెక్టర్ జెన్న నేతృత్వంలో కల్యాణసింగుపూర్ బీడీఓ మనీషా దాస్, తహసీల్దార్ రంజన్ కుమార్ సెట్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి అసీమా రావ్, ఏసీఎస్ఓ శుభాంశు భొయ్, కల్యాణసింగుపూర్ ఐఐసీ నీలకంఠ బెహరాతో ఏర్పడిన దర్యాప్తు కమిటీ గ్రామంలో పర్యటించి వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ పెద్దలతో మంతనాలు చేశారు. గ్రామ కట్టుబాట్లను వ్యతిరేకించే ఎవరికైనా ఇలాంటి దండనే ఉంటుందని స్థానికులు ఖరాఖండిగా చెప్పడంతో దర్యాప్తు బృందం అవాక్కైంది. సబ్ కలెక్టర్ స్పందిస్తూ కట్టుబాట్లను పాటించాలని, కానీ ఇలాంటి అమానవీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఏదైనా తప్పు జరిగితే అందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని వివరించారు. గ్రామస్తులను తాము చైతన్య పరిచామని, తాము గ్రామ కట్టుబాట్లను అనుసరించామే తప్ప ఎవరినీ హింసించలేదని గ్రామస్తులు తెలిపారని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. కొంధొ కులం సమాజం అధ్యక్షుడు జొగేంద్ర వడక మాట్లాడుతూ గ్రామ కట్టుబాట్లను మీరాడని దండన విధించామని, వెలి వేయలేదని తెలిపారు. ఆచార వ్యవహారాలు ఎవరు అతిక్రమించినా శిక్ష తప్పదన్నారు. చట్టాన్ని మీరి తాము ఏ పనీ చేయలేదని తెలిపారు. ప్రేమికుడు లక సరక మాట్లాడుతూ తమను వెలి వేయలేదని, కక్ష సాధింపు ఏమీ లేదని, గ్రామ కట్టుబాట్ల ప్రకారం శిక్ష విధించారని తెలిపారు.



గ్రామస్తులతో సమావేశమైన అధికారులు (ఇన్‌సెట్‌లో) ప్రేమికుడు లక సరక



సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న



నాగలికి కట్టి ప్రేమికులను దున్నిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

చోరీ కేసులో నలుగురు అరెస్టు

జయపురం: జయపురం మహాత్మాగాంధీ రోడ్డులోని సాయిబాబా మందిర ప్రాంతంలో ఉన్న బ్యాటరీ దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు జయపురం పట్టణ పోలీసులు సోమవారం వెల్లడించారు. ఆ దుకాణంలో నాలుగు లక్షల రూపాయల నగదు, బంగారు నగలు దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో ముమ్మరంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఉల్లాష్ చంద్ర రౌత్ వెల్లడించారు. అరెస్టయిన వారి నుంచి 70 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టయిన వారిలో స్థానిక డెప్పుగుడ వాసి ధనుంజయ, ఎస్.ధనుంజయ, సురేంద్ర హరిజన్, కుంధారిగుడకు చెందిన రింకు సమరిలియ, ఖాళసాహి ప్రాంత వాసి భగవాన్ ముఎదులి ఉన్నారన్నారు. అరెస్టయిన వారిని కోర్టులో హాజరు పరచినట్టు చెప్పారు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. గత జూన్ 29వ తేదీ రాత్రి దుండగులు దుకాణం గోడకు కన్నం పెట్టి లోపలికి ప్రవేశించి డబ్బు, బంగారు నగలు దొంగిలించినట్లు దుకాణం యజమాని వంశీ తయాల్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించి నలుగురుని అరెస్టు చేశామన్నారు.

న్యాయ విచారణ జరగాలి: శ్రీకాంత్



ఎఫ్ ఎమ్ కళాశాల ప్రాంగణంలో క్రైం శాఖ దర్యాప్తు బృందం

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి సంఘటనపై న్యాయ విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆ పార్టీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ జెనా ఈ సంఘటనపై స్పందిస్తు న్యాయ లేదా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విచారకర సంఘటనపై స్వతహాగా జోక్యం చేసుకున్న రాష్ట్ర క్రైమ్ శాఖ సోమ వారం నిరవధికంగా కొనసాగింది. 2 మంది సభ్యులతో కూడిన దర్యాప్తు బృందం కళాశాల ప్రత్యక్షంగా సందర్శించి దర్యాప్తు కొనసాగించింది.

రిజర్వాయర్‌లో దిగి జార్ఖండ్ వాసి మృతి



కొలాబ్ రిజర్వాయర్ ఒడ్డున మృతదేహంతో అగ్నిమాపక సిబ్బంది

కొరాపుట్: లోతు తెలియక నీటిలో దిగి జార్ఖండ్ వాసి మృతి చెందాడు. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రం సమీపంలో గల కొలాబ్ రిజర్వాయర్‌లో జార్ఖండ్‌కి చెందిన సంతోష్ ఖండల్వాల్ (28) మృతి చెందాడు. సునాపుర్ వెళ్లడానికి రిజర్వాయర్ దాటే ప్రయత్నం చేశాడు. చుట్టు తిరిగి వెళ్లడానికి దూరం ఎక్కువ అవుతుందని, నీటి లోతు తక్కువగా ఉంటుందని దిగాడు. ఆ ప్రాంతంలో ఉన్న ఊబిలో మునిగి పోయాడు. ఇది గమనించిన ఆ ప్రాంత ప్రజలు కేకలు వేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు గాలించి మృతదేహం వెలికి తీశారు. మృతుడు ఎల్‌అండ్‌టీలో కార్పెంటర్‌గా పని చేస్తున్నాడని స్థానికులు పేర్కొన్నారు. స్వస్థలం వెళ్లడానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లి టికెట్ తీసి తిరిగి వస్తుండగా మృత్యువాత పడ్డాడు.

విద్యార్థిని ఆత్మహత్యపై గవర్నరు జోక్యం

భువనేశ్వర్: బాలసోర్ ఫకీర్ మోహన్ (స్వయం ప్రతిపత్తి) కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి సంఘటనపై రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి జోక్యం చేసుకున్నారు. రాష్ట్ర ఉన్నత విద్య మంత్రి సూర్యబన్షి సూరజ్‌తో మాట్లాడారు. ప్రస్తుతం స్థానిక ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధిత యువతి ఈ దయనీయ పరిస్థితికి దారితీసిన పరిస్థితులు, పరిస్థితుల నివారణకు చేపట్టిన చర్యలకు సంబంధించి గవర్నర్ పూర్తి వివరాలు కోరారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత యువతికి మద్దతు కల్పించడంతో జవాబుదారీతనం నిర్ధారించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థిని ఆరోగ్యంపై తాజా సమాచారం కోసం ఎయిమ్స్ భువనేశ్వర్ డైరెక్టర్‌తో గవర్నరు మాట్లాడారు. ఎయిమ్స్ వైద్య నిపుణుల బృందం పర్యవేక్షణలో చికిత్స విజయవంతమై యువతి త్వరగా కోలుకోవాలని గవర్నరు ఆకాంక్షించారు. విద్యార్థుల భద్రత, మానసిక శ్రేయస్సు, గౌరవాన్ని ఎల్లప్పుడూ కాపాడాలి. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యతతో వ్యవహరించాలని ఆయన అధికారులను కోరారు.

18 పశువులు పట్టివేత

రణస్థలం: మండలంలోని జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 18 గేదెలను జేఆర్‌పురం పోలీసులు సోమవారం ఉదయం పట్టుకున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యానులో తనిఖీలు చేపట్టారు. విజయనగరం జిల్లాలోని గుర్ల మండలంలో ఉన్న గుజ్జంగవలస గోశాలకు పశువులను తరలించారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నిరసనల ప్రకంపన



కళాశాల ఆవరణలో నిరసనల సెగ



ముఖ్యమంత్రి దిష్టి బొమ్మతో నిరసనకారుల ప్రదర్శన.

భువనేశ్వర్: విద్యార్థి, యువజనం, మహిళలు, విపక్ష వర్గాల ధర్నాలు, నిరసనలతో బాలాసోర్ ప్రకంపిస్తోంది. స్థానిక ఫకీర్ మోహన్ కళాశాలలో చదువుకుంటున్న యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి భువనేశ్వర్ ఎయిమ్స్ ఆస్పత్రిలో మృత్యు పోరాటం చేస్తోంది. దీనిపై ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెస్ విద్యార్థి, యువజన, మహిళా వర్గాలు నిరవధికంగా నిరసన ప్రదర్శిస్తున్నాయి. నగరంలో ప్రభుత్వ వ్యతిరేకంగా నిరసన ఊరేగింపులు, కళాశాల ఆవరణలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉన్నత విద్యా విభాగం మంత్రి సూర్యవంశీ సూరజ్ దిష్టి బొమ్మలు దహించారు. ఆత్మహత్యాయత్నంపై నిరసనలు తీవ్రమవుతున్నాయి. సోమవారం బిజూ జనతా దళ్, కాంగ్రెస్ నాయకులు బాలాసోర్‌ను సందర్శించారు. బీజేడీ నాయకులు ప్రతాప్ జెనా, బ్యోమకేష్ రాయ్, దేవి త్రిపాఠి, జ్యోతి పాణిగ్రాహి తదితరుల బృందం బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డీజీకి వినతి పత్రం సమర్పించారు.



ఫకీర్ మోహన్ కళాశాల ఆవరణలో విద్యార్థుల ఆందోళన



బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ర్యాలీ



బాలాసోర్‌లో బీజేడీ వర్గీయుల నిరసన ఊరేగింపు

ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా సంధ్యా రాణి మాఝీ



సంధ్యా రాణి మాఝీ



డ్రైవరు బాధ్యతల్లో సంధ్యా రాణి మాఝీ

భువనేశ్వర్: మయూర్‌భంజ్‌కు చెందిన సంధ్యారాణి మాఝి రాష్ట్ర రవాణా శాఖ ఆధీనంలో ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా చేరారు. ఆమె తొలి మహిళా ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా నియమితులు కావడం విశేషం. రక్షణ లేదా నౌకా దళంలో ఉద్యోగ జీవితం కొనసాగించడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో సంధ్యారాణి మాఝి డ్రైవింగ్‌ను ప్రారంభించింది. ఆమె భర్త రామ్ రే మాఝీ (డ్రైవర్) ప్రోత్సాహంతో డ్రైవింగ్ నేర్చుకుని అద్దె డ్రైవర్‌గా పదేళ్లకు పైగా పనిచేసింది. తర్వాత, ఆమె 2023లో జాజ్‌పూర్‌లోని ఛటియాలోని హెచ్‌ఎంవీ శిక్షణా కేంద్రంలో చేరింది. ఈ శిక్షణతో జపాన్‌లో పనిచేసే అవకాశం చేరువైన కుటుంబ బాధ్యతలతో స్వరాష్ట్రంలో ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం 3 గంటలకు డ్రైవరుగా పని చేసి ఒక పార్లర్‌లో బ్యూటీషియన్‌గా పని చేసింది.

కూరగాయల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కూరగాయల మార్కెట్



ఆహుతైన సామగ్రి

భువనేశ్వర్: పారాదీప్ బొడొ పాడియా ప్రాంతంలోని కూరగాయల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 7 కూరగాయల దుకాణాలు దగ్ధమయ్యాయి. లక్షలాది రూపాయల విలువైన కూరగాయలు, తదితర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. రెండు యూనిట్ల అగ్నిమాపక దళాల బృందాలు మంటలను నివారించడంలో పాల్గొన్నాయి.

ఎఫ్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్ అరెస్టు



చీఫ్ సెక్రటరీ సమీక్ష సమావేశం



దిలీప్ ఘోష్, ఎఫ్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీరు మోహన్ కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్ ఘోష్‌ను అరెస్టు చేశారు. ఈ కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి యత్నం సంఘటనలో ఇటీవల సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై పలు వర్గాలు నిర్వహిస్తున్న విచారణ నేపథ్యంలో సోమవారం స్థానిక సహదేవఖుంట ఠాణా పోలీసులు అతనిని అరెస్టు చేశారు. ఈ సంచలనాత్మక సంఘటనలో ఇంతకు ముందు విద్యా శాఖ హెచ్‌ఓడి సమీర్ సాహును అరెస్టు చేశారు.

చీఫ్ సెక్రటరీ సమీక్ష

బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాలలో విద్యార్థిని ఆత్మాహుతి ఘటన తీవ్ర కలకలం రేపుతుంది. సర్వత్రా ఆందోళన వ్యక్తమై పరిస్థితి ఉద్రిక్తం అవుతుంది. ఈ నేపథ్యంలో తాజా స్థితిగతుల్ని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా, శిశు అభివృద్ధి, ఉన్నత విద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖల ప్రధాన కార్యదర్శులతో చర్చించారు.

స్థలం మంజూరు చేయాలని వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణ యాదవ సంఘం అభివృద్ధి, స్వంత కార్యాలయం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ను అభ్యర్థించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో శ్రీకృష్ణయాదవ సంఘం అధ్యక్షులు ఎ.కులవర్ధన రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు నబకిశోర్ శోబోరో, కాశీనగర్ సమితి మాజీ చైర్మన్ సి.హెచ్. సింహాద్రి, బరంపురం ఎం.పి. ప్రతినిధి దారపు రాజేష్ కుమార్ ఉన్నారు.

జాతీయ దివ్యాంగ పోటీలకు ఎంపికలు

కాశీబుగ్గ: జిల్లాస్థాయి దివ్యాంగ సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ఎంపికలు ఈనెల 26వ తేదీన కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో జరగనున్నట్లు అధికారులు తెలియజేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ప్రతీ దివ్యాంగ క్రీడాకారులు ఈనెల 24వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93813 68209, 80081 62432, 91776 93836 నంబర్లను సంప్రదించాలని స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు తురల్లి రాము, డి.అచ్యుతరావు, కార్య నిర్వాహక సభ్యులు ఎన్.శ్రవంతి, ఎన్.మోహన్ రావు, గణపతి, నీలం తదితరులు కోరారు.

ఉర్లాం స్కూల్‌లో చోరీ

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.40 వేలు విలువ కలిగిన పరికరాలు చోరీకి గురయ్యాయని హెచ్‌ఎం భారతి సోమవారం తెలిపారు. మరుగుదొడ్లలో ఉన్న విలువైన స్టీల్ ట్యాప్‌లు, ఇతర పరికరాలు చోరీ చేశారన్నారు. శని, ఆదివారాలు వరుసగా స్కూల్‌కు సెలవులు కావడంతో గుర్తు తెలియన వ్యక్తులు తాళాలు విరగ్గొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాడు-నేడు పథకంలో భాగంగా ఈ పాఠశాలలో అత్యుత్తమ సదుపాయాలు కల్పించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రణస్థలం: లావేరు మండలంలోని జాతీయ రహదారి బెజ్జిపురం కూడలి సమీపంలో ఉన్న హైవే విశ్రాంతి భవనంలో బెజ్జిపురం గ్రామానికి చెందిన శివాజీ(54) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతిపై కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలాన్ని లావేరు ఏఎస్ఐ భుజంగరావు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతిడికి భార్య సబ్బి ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుప్తేశ్వరం సందర్శన



నందపూర్ ప్రాంతంలో పురాతన జైన మందిర శిథిలాలను పరిశీలిస్తున్న అధికారులు



గుప్తేశ్వరంలో పర్యటిస్తున్న రాష్ట్ర పర్యాటక కార్యదర్శి బల్వంత్ సింగ్, కలెక్టర్ వీ.కీర్తి వాసన్

కొరాపుట్: రాష్ట్ర పర్యాటక కార్యదర్శి, కొరాపుట్ జిల్లా నోడల్ అధికారి బల్వంత్ సింగ్ గుప్తేశ్వరాన్ని సందర్శించారు. సోమవారం కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి రామగిరి సమీపంలో గల దండకారణ్యంలో ఉన్న సహజ సిద్ధ పుణ్యక్షేత్రం గుప్తేశ్వరంలో పర్యటించారు. అక్కడ కోట్లాది రూపాయలతో నిర్మితమవుతున్న శబరి నది వద్ద ఘాట్లు, స్నానపు గదులు, విశ్రాంత స్థలాలు, రోడ్లు, ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలు కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ వివరించారు. అనంతరం నందపూర్ ప్రాంతంలో పురాతన జైన మత ప్రార్థనా స్థలాలను పరిశీలించారు. అనంతరం కొరాపుట్ కాఫీ బోర్డు, లమ్తాపుట్‌లో భారీ తాగునీటి ప్రాజెక్ట్‌లలో పర్యటించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

వాన నీటిలో ఉక్కు నగరం



జల వలయంలో ఉక్కు నగరం



కృత్రిమ వరదలో చిక్కుకున్న ప్రయాణికుల బస్సు

భువనేశ్వర్: ఎడతెరిపి లేని వానలు రాష్ట్రంలో ఉక్కు నగరం రూర్కెలాని ముంచెత్తాయి. ఆదివారం రాత్రి కుండపోత వర్షంతో నగరం జల దిగ్బంధంలో చిక్కుకుంది. రహదారులు, జనావాసాలు, రైల్వే స్టేషన్, జలాశయాలు జోరు వానతో నీటి వలయంలో చిక్కుకున్నాయి. నగరం అంతటా వరద తాండవించింది. ఈ ప్రాంతంలో బ్రాహ్మణి నది నీటి మట్టం గణనీయంగా పెరిగింది. వరద నీటి విడుదల కోసం మందిర జలాశయం 9 గేట్లు తెరిచారు.



రూర్కెలా రైల్వే స్టేషను ఆవరణ



రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతం జలమయం

మావోయిస్టు కార్యకలాపాలపై దృష్టి



గౌరవ వందనం అందుకుంటున్న డీఐజీ కన్వర్ విశాల్ సింగ్

కొరాపుట్: మావోయిస్టు కార్యకలాపాలపై దృష్టి ఉంటుందని సదరన్ వెస్టర్న్ రేంజ్ డీఐజీ కన్వర్ విశాల్ సింగ్ ప్రకటించారు. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలో డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కొరాపుట్, నబరంగ్‌పూర్, రాయగడ, మల్కన్‌గిరి, నువాపడ జిల్లాల్లో అప్రమత్తంగా ఉంటామన్నారు. అలాగే పోలీసులు నేర విచారణలో ముందడుగు వేస్తారన్నారు. ముఖ్యంగా గంజాయిపై ఉక్కు పాదం మోపుతామన్నారు. తక్షణం రేంజ్‌లో ఎస్పీలతో సమావేశమైన తర్వాత పరిస్థితిపై సమీక్షిస్తామన్నారు. పదేళ్ల కిందట ఎస్పీగా పనిచేసిన చోటకు డీఐజీగా రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. తనకు కొరాపుట్ వాతావరణం ఎంతో ఇష్టమన్నారు.

రాష్ట్రపతి పరామర్శ

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం స్థానిక ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించారు. ఆమెతో రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి మరియు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఉన్నారు.

రాష్ట్రపతి నేటి కార్యక్రమాలు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కటక్‌లోని రెవెన్షా విశ్వవిద్యాలయం 13వ వార్షిక స్నాతకోత్సవానికి హాజరై ఉత్తీర్ణులకు పట్టాలు ప్రదానం చేస్తారు. అనంతరం కటక్‌లోని రెవెన్షా బాలికల ఉన్నత పాఠశాలలో మూడు భవనాల పునరాభివృద్ధికి ఆమె శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఆదికవి సరళా దాస్ 600వ జయంతి వేడుకల్లో పాల్గొని కళింగ రత్న అవార్డు 2024ను ప్రదానం చేస్తారు.

• కాడెద్దులు లేకున్నా..



ఉన్న పాలం పోయింది. కాడెద్దులు దూరమయ్యాయి. అప్పులు బతుకు మీదకు వచ్చాయి. కానీ ఆయనకు తెలిసింది ఒక్కటే. వ్యవసాయం. భూమి ఉన్నా లేకపోయినా, కాడెద్దుల సాయం ఉన్నా లేకున్నా.. ఆయన చేయగలిగింది ఒక్కటే వ్యవసాయం. జయపూర్ పట్టణ సమీపంలో బంకబిజ గ్రామ వద్ద రోడ్డు పక్కన పొలంలో ఎద్దుల సాయం లేకుండా దుక్కి దున్నుతున్న ఇతని పేరు రామ పరిజ. సాగు తప్ప ఇంకేమీ తెలియని ఈ మనిషి సొంత పొలం పోయాక కొంత పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. ట్రాక్టర్ అద్దె కట్టలేక ఇలా దున్నే బాధ్యతను భుజానికెత్తుకున్నాడు.

– కొరాపుట్

• బెంబేలెత్తించిన పైపు నీరు



స్థానిక జయదేవ భవన్ పరిసరాల్లో నీటి పైపు చిట్లడంతో భయానక పరిస్థితి చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం ఈ పరిస్థితి నెలకొంది. నగర వ్యాప్తంగా తాగు నీరు సరఫరా చేసే ప్రధాన అనుసంధాన పైపు కావడంతో నీటి ఒత్తిడి అత్యధికంగా ఉంటుంది. ఈ పైపు చిల్లుబడి సుమారు 50 అడుగుల ఎత్తుకు నీరు చిమ్మడంతో చేరువలో 30 అడుగుల ఎత్తున 30 కేవీ విద్యుత్ సరఫరా అనుసంధాన వ్యవస్థని అధిగమించి నీరు నింగికి ఎగసింది.

– భువనేశ్వర్

క్లుప్తంగా

తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల రేపు


తోటపల్లి జలాశయం

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలో ఉన్న పాత ఆయకట్టుకు ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరందించి పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నెల 16న బుధవారం తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు జలవనరులశాఖ ఏఈ డీపీ రమణ సోమవారం తెలిపారు. ఈ జలాశయం పరిధిలో ఉన్న చెరువులను తొలుత నింపేందుకు లక్ష్యంగా చేసుకున్నామన్నారు. అనంతరం ప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టు పరిధిలో పాత ఆయకట్టు కుడి, ఎడమకాలువ పరిధిలో ఉన్న 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి పంపిణీ చేస్తామని చెప్పారు.

రోగులతో ఏరియా ఆసుపత్రి కిటకిట


ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి సోమవారం రోగులతో కిటకిటలాడింది. ఒక్కరోజే సోమవారం 442 ఓపీ వచ్చింది. వారిలో 94 మంది జ్వరాలతో బాధపడుతూ రాగా వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించారు. మలేరియా ఆర్‌డీటీ కిట్‌లో 18 మందికి పాజిటివ్ రాగా, స్లైడ్ మలేరియా పోజిటివ్ ఒక కేసు వచ్చింది. 49 మందిని ఇన్‌పేషెంట్లుగా జాయిన్ చేసుకుని వారికి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరెంటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. మిగతా వారికి తగిన ట్రీట్‌మెంట్ ఇచ్చి మందులు పంపిణీ చేశామన్నారు.

23 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

శృంగవరపుకోట: జిల్లా కేంద్రం విజయనగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జిల్లాస్థాయి చాంపియన్ షిప్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు సోమవారం తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ సీఈఓ శ్రీరాములు మాట్లాడుతూ 23న పోటీలు ఉదయం 8గంటలకు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 20తేదీ లోగా ప్రవేశ రుసుము జి.తేజేశ్వరరావు(9440505275)పార్వతీపురం, కె.అపర్ణబాబా(7981111705)బొబ్బిలి, ఎం.డి.అబ్దుల్(9515729785)సాలూరు, పి.శ్రీరాములు(7989199534)ఎస్‌కోట, కొత్తవలస(9030185690) వై.గణేష్, జి.శ్రీనివాసరావు(9133773485)-విజయనగరం, కె.వేణుగోపాల్(9866933193) చీపురుపల్లిలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏ కేటగిరిలో అయినా ఆరు టీముల కన్నా తక్కువ టీములు హాజరైతే ఆ కేటగిరిలో చాంపియన్ షిప్ నిర్వహించబోమని విజేతలకు అదే రోజు బహుమతి ప్రదానం చేస్తారని స్పష్టం చేశారు.

బుచ్చెంపేటలో పోలీస్ పికెట్


బుచ్చెంపేటలో వివాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్, తదితరులు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట గ్రామంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు సోమవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామంలో స్థల వివాదానికి సంబంధించి రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగిన విషయం తెలిసిందే. దీని దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా పికెట్ నిర్వహించడంతో పాటు పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. వివాదానికి కారణమైన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎవరైనా అనవసరంగా కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టేట్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న లెక్చరల్ పోస్టుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. రాజాంలోని జీఎంఆర్, జొన్నాడ లెండీ, గాజులరేగ వద్ద ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కాలేజీల్లో పరీక్షల ఏర్పాట్లపై ఆరా తీశారు.

అర్జీదారు సంతృప్తి చెందేలా.. వినతుల పరిష్కారం

• కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


దివ్యాంగులకు ఉపకరణాలను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక

పార్వతీపురం టౌన్: జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించి ప్రజల నుంచి 160 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన వినతులను ఆయాశాఖాధికారులకు సూచిస్తూ, వాటిపై సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్ఓ కె.హేమలత, కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ డా.పి.ధర్మచంద్రా రెడ్డి డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, వివిధ శాఖల అధికారులు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

దివ్యాంగులకు ఉపకరణాలను జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పంపిణీ చేశారు. పాలకొండ మండలం కొండవీధికి చెందిన జమ్మాన తేజశ్రీ, సీతానగరం మండలం వెంకటాపురానికి చెందిన కట్టమూరి కార్తీక్ తమకు ల్యాప్ టాప్‌లు మంజూరు చేయాలని కోరగా, జేసీ వాటిని పంపిణీ చేశారు. అలాగే కొమరాడ మండలం ఆర్తాం గ్రామానికి చెందిన వడ్డమాని ప్రసాదరావుకు చెవిటి మిషనును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు ఎం.సుధారాణి, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికార ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురం రూరల్: ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

ఫిర్యాదులు వాస్తవాలైతే చట్టపరిధిలో చర్యలు

పార్వతీపురం రూరల్: ప్రతి వారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదులు వాస్తవాలైతే తక్షణ చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించు కోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 13 ఫిర్యాదులు రాగా డీసీఆర్బీ, మహిళా పీఎస్ హెడ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చిన్నారి విషాదం..!

• విద్యార్థుల మధ్య ముష్టియుద్ధం
• దెబ్బలు తాళలేక తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి


విద్యార్థి మృతదేహం


కార్తీక్(ఫైల్)


మృత దేహం వద్ద రోదిస్తున్న తల్లి విజయ, బంధువులు

బొబ్బిలి: పట్టణంలోని అభ్యుదయ హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల మధ్య గొడవ ఓ విద్యార్థి మృతికి దారితీసింది. మనస్పర్థలకు ఓ నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. నిరుపేద క్షురక కుటుంబానికి చెందిన ఒక్కగానొక్క కుమారుడు ఈ కొట్లాటలో చనిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. బొబ్బిలిలో సోమవారం జరిగిన ఈ విషాదకర సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కాలేజీ రోడ్డులో బార్బర్ షాపు పెట్టుకుని జీవనం వెళ్లదీస్తున్న సుందరాడ సత్యనారాయణ(సంతోష్), విజయ దంపతులకు కార్తీక్(14), కీర్తన ఉన్నారు. కార్తీక్‌ను పట్టణంలోని అభ్యుదయ స్కూల్లో చదివిస్తున్నారు. సీసీటీవీలో కనిపించిన దృశ్యాల ప్రకారం రోజులాగే విద్యార్థి కార్తీక్ స్కూల్ విడిచిపెట్టాక సహ విద్యార్థులతో కలిసి కోట గుమ్మంలోంచి పట్టణంలోని సున్నపు వీధిలోని తన ఇంటికి వస్తున్నాడు. వారితో పాటు వస్తున్న పదో తరగతి చదువుతున్న మండలంలోని గున్నతోటవలసకు చెందిన చైతన్య..కోటలో గంట కొట్టే ప్రాంతం వద్ద వెనక్కు నడిచి వస్తున్న కార్తీక్ ఒక్కసారిగా పిడిగుద్దులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అయితే కొద్ది సేపే కొట్లాడుకున్నప్పటికీ దెబ్బలకు తాళలేని కార్తీక్ ఐదారు అడుగులు వేశాక ఒక్కసారిగా నడక బాట పక్కగా ఒరిగిపోయి కుప్పకూలాడు. వెంటనే స్థానికులు కార్తీక్‌ను సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

మృతదేహాన్ని వెనక్కి తెచ్చిన బంధువులు

విద్యార్థి మృతదేహాన్ని వైద్యసిబ్బంది గొడవవుతుందని ఆలోచించి పోస్ట్‌మార్టం రూమ్‌లోకి తీసుకువెళ్లిపోయారు. ఏం జరిగిందో తెలియకుండా పోస్ట్‌మార్టం చేయడానికి వీల్లేదని బంధువులు విద్యార్థి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం రూమ్ నుంచి మళ్లీ ఆస్పత్రిలోకి తీసుకువచ్చారు. ఈ లోగా పోలీసులకు, పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి ఆస్పత్రికి చేరుకున్నారు. కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఆస్పత్రి ప్రాంగణమంతా జనాలతో నిండిపోయింది. సీఐ కె.సతీష్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి, ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. కుటుంబ సభ్యులు, యాజమాన్యం, తల్లిదండ్రులతో రాత్రి పది గంటల వరకూ చర్చిస్తూనే ఉన్నారు. పోలీసులు వివరాలు వెల్లడించే వరకూ విద్యార్థులు ఎందుకు కొట్లాడుకున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే క్రికెట్ లేదా బాలిక విషయమై ఇద్దరి మధ్య కొద్ది రోజులుగా మాటల్లేవని, ఈ నేపథ్యంలోనే స్కూల్ నుంచి నడిచి వస్తుండగా భావోద్వేగానికి గురైన వారిద్దరూ ఒక్కసారిగా తీవ్రంగా కొట్లాడుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సీఐ కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ సంఘటనపై కేసు నమోదు చేశామని, విద్యార్థుల కేసు జువైనల్ కిందికి వస్తుందని పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఖాకీల వేధింపుల నుంచి రక్షణ కావాలి

• ఏఎస్పీ సౌమ్యలతకు బాధితుడి మొర


ఏఎస్పీ సౌమ్యలతకు సమస్య చెప్పుకుంటున్న ఫిర్యాదుదారు కమల్ బాబు

విజయనగరం క్రైమ్: బొబ్బిలి పోలీసుల నుంచి తనను కాపాడాలంటూ విజయనగరం డీపీఓలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఓ ఫిర్యాదుదారు మొర పెట్టుకున్నాడు. నా భార్య ప్రవర్తన బాగోలేదు..నాకు నా కొడుకు భవిష్యత్తే ముఖ్యం..భార్య వద్దు కొడుకును పంపను. కోర్టులో కేసు నడుస్తున్నా..బొబ్బిలి పోలీసులు తనను పిలిచి వేధిస్తున్నారంటూ ఏఎస్పీ సౌమ్యలతకు ఫిర్యాదు చేసి ఓ బాధితుడు వాపోయాడు. పైగా ఏడేళ్లు అవుతున్నప్పటికీ తన భార్య ప్రవర్తన బాగోలేక ఏడేళ్ల కొడుకు భవిష్యత్తు కోసం విడాకులు కోరుకున్నానని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి సమక్షంలో కోర్టులో కేసు నడుస్తోందని ఫిర్యాదు దారు ఓరుగంటి కమల్ బాబు డాక్యుమెంటల్ ఎవిడెన్స్‌తో తన బాధ, వెళ్లగక్కాడు. తాను బొబ్బిలిలో ఉంటూ ఏసీ రిపేర్ పనులు చేసుకుంటూ కొడుకును చూసుకుంటున్నానని, కానీ విడాకుల కేసు కోర్టులో ఉండగానే తిరిగి తన భార్య వేధిస్తోందని బొబ్బిలి స్టేషన్‌లో కేసు కూడా నడుస్తోందని తనకు న్యాయం చేయాలని ఏఎస్పీకి ఫిర్యాదు చేశాడు. తక్షణమే బొబ్బిలి ఎస్సై రమేష్‌పై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని వేడుకున్నాడు. ఈ మేరకు ఫిర్యాదు దారు సమస్య విన్న ఏఎస్పీ సౌమ్యలత వెంటనే బొబ్బిలి పోలీసులతో మాట్లాడి కేసు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఊరట నిచ్చిన వర్షం


పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

పార్వతీపురం రూరల్: రెండు వారాల నుంచి వర్షాలు లేకపోవడంతో ఇప్పటికే ఖరీఫ్ రైతులు వేసిన వరి ఎదలు ఎండిపోయి ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో సోమవారం రాత్రి కురిసిన వర్షం రైతుల్లో ఆశలు చిగిరించేలా చేసింది. అలాగే ఇప్పటికే వరినారు మళ్లు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వరి ఉభాలకు కూడా రైతులు సిద్ధం కానున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం చెరువుల్లో నీరు చేరితే వరి ఉభాలకు మరింత అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు

పార్వతీపురం రూరల్: రాష్ట్ర డీజీపీ ఆదేశాలతో ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి జిల్లాలో పనిచేస్తున్న పోలీసు శాఖ ఉన్నతాధికా రులు, అలాగే సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని (మాస్టర్ హెల్త్‌చెకప్) సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్‌డివిజన్‌ల పరిధిలో ఉన్న స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, ఏఆర్, మినిస్టీరియల్ సిబ్బంది, హోంగార్డులకు ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ పరీక్షలు విజయనగరంలో ఉన్న మెడికవర్, శ్రీకాకుళంలో మెడికవర్ ఆస్పత్రుల్లో నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు.

హామీలిస్తే సరి.. తోడ్పాటు ఎప్పుడో మరి!

• అధికారుల చుట్టూ తిరుగుతున్న ఆదర్శ రైతు బాబూరావు
• తక్కువ మదుపుతోనే వినూత్న యంత్రాలు తయారీ
• జిల్లా యంత్రాంగం నుంచి కొరవడుతున్న సహకారం


బాబూరావు తయారు చేసిన యంత్ర పరికరం


తనకు వచ్చిన పత్రాలు, పతకాలతో బాబూరావు

సాక్షి, పార్వతీపురం మన్యం:

మెకానిక్‌గా పని చేస్తూ, వ్యవసాయం చేసుకుంటూ, రైతులకు తక్కువ పెట్టుబడితో యంత్ర పరికరాలను తయారు చేస్తున్న దమరశింగి బాబూరావుకు జిల్లా యంత్రాంగం నుంచి సహకారం కొరవడుతోంది. బహుళ పంటలను ఒకేసారి విత్తుకునేందుకు అన్ని విధాలుగా రైతుకు ఉపయోగకరమైన వినూత్న డ్రమ్‌సీడర్‌ను బాబూరావు రూపొందించారు. దీనికి భారత ప్రభుత్వం పేటెంట్ కూడా మంజూరు చేసింది. కొన్నాళ్ల క్రితం ఢిల్లీలో జరిగిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మేళన్‌లోనూ ఆయన యంత్ర పరికరాలను ప్రదర్శించి, అందరి మన్ననలూ పొందారు. పతకాలు కూడా పొందాడు. ఈయన చదివింది పదో తరగతే అయినా.. ప్రతిభను గుర్తించి, కేంద్ర ప్రభుత్వం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందజేసింది. దీంతో పాటు.. మరిన్ని పరికరాలను తయారు చేయించాలనే ఉద్దేశంతో గత కలెక్టర్ హయాంలో బాబూరావు పేరిట ఇన్‌కార్పొరేషన్ కంపెనీ డీబీఆర్ అగ్రిమార్ట్ ఓపీసీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను రిజిస్ట్రేషన్ చేయించారు. కంపెనీ నెలకొల్పేందుకు గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద ఎకరా స్థలం కూడా మంజూరు చేశారు. దానికి సంబంధించి ఇంకా ఉత్తర్వులు రాలేదు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ బాబూరావు తిరుగుతూనే ఉన్నాడు. సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశాడు. కంపెనీ పెట్టి, నూతన వ్యవసాయ పరికరాలతో రైతులకు సహకారం అందిస్తానని, మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెబుతున్నా.. అధికారులు తనను ఎందుకు ప్రోత్సహించడం లేదో అర్థం కావడం లేదని బాబూరావు వాపోతున్నాడు.

జేఎన్‌టీయూ జీవీలో ఎమర్జింగ్ టెక్నాలజీపై సర్టిఫికేషన్ కోర్సు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో 'ఎమర్జింగ్ టెక్నాలజీ' కోర్సుకు సంబంధించి వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి సోమవారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి కోర్సుల ద్వారా సంబంధిత నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే ఇలాంటి కోర్సులను భవిష్యత్తులో మరిన్ని యూనివర్సిటీ అందిస్తుందన్నారు.

రైల్వే పార్కింగ్ ఫీజు పెంపుపై ఆందోళన

• డీఆర్‌ఎంకు వినతినిచ్చిన ప్రయాణికులు


పార్కింగ్ స్థలం వద్ద ఆందోళన చేస్తున్న ఎంఎస్‌టీలు

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్‌లో వాహనాలు పార్కింగ్ చేసేవారినుంచి ప్రైవేటు పార్కింగ్ వ్యవస్థ నిలువు దోపిడీకి రంగం సిద్ధం చేసింది. ఒకేసారి నెలకు రూ.300 ఉన్న పార్కింగ్ ఫీజును మూడురెట్లు పెంచి రూ.900 చేయడంతో చిరుద్యోగులు, దినసరి కూలీలు భగ్గుమన్నారు. పార్కింగ్ ఫీజుల దోపిడీపై సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. విజయనగరం నుంచి విశాఖ పట్టణం వెళ్లేందుకు రైల్వే మంత్లీ సీజన్ టికెట్ (ఎంఎస్‌టీ) రూ.250 ఉంటే, వాహనం పార్కింగ్ ఫీజు రూ.900లకు పెంచడమేమిటంటూ పార్కింగ్ సిబ్బందిని నిలదీశారు. రోజుకు బైక్‌కు రూ.10లు ఉన్న ఫీజును రూ.40కి ఎలా పెంచుతారని నిలదీశారు. దీనిపై డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఫీజులు తగ్గించుకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

95:5 నిష్పత్తిలో బియ్యం సరఫరా

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95:5 శాతం నిష్పత్తిలో జిల్లాలో ఉన్న 5,71,288 రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం సరఫరా చేస్తున్నట్లు డీఎస్‌ఓ మధుసూదనరావు తెలిపారు. మండలంలోని పలు రేషన్ దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకార్డుల కోసం 53,500 దరఖాస్తులు రాగా 37,351 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించామని, వారికి త్వరలో స్మార్ట్ కార్డులు మంజూరుచేసే అవకాశం ఉందన్నారు.

బ్యాటరీ స్కూటీలు దగ్ధం


దగ్ధమయిన స్కూటీలు

బొబ్బిలి: పట్టణంలోని సిరిపురపు వీధిలో ఓ వ్యక్తి ఇంటి ముందు ఉంచిన బ్యాటరీ స్కూటీ సోమవారం పేలిపోయింది. దీనిపక్కనే ఉన్న మరో స్కూటీ కూడా మంటల ధాటికి కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా బ్యాటరీ వాహనం కాలిపోయినట్లు వాహనదారులు చెబుతున్నారు.

డ్యూయల్ మేజర్ విధానం అమలు చేయాలి

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లు త్వరగా ప్రారంభించాలి. డ్యూయల్ మేజర్ విధానం అమలు చేయాలని, సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు మాట్లాడుతూ..ఇంటర్మీడియట్ రిజల్ట్స్ వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్స్ ప్రారంభించలేదన్నారు. ఒకవైపు ప్రైవేట్ కాలేజీల్లో అనధికారికంగా అడ్మిషన్లు చేసుకుంటూ క్లాసులు నడుపుతున్నారని, దీనివల్ల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాయిన్ అవుతున్న విద్యార్థులు నష్టపోతారన్నారు. అడ్మిషన్లు ఆలస్యం అవడంతో సెమిస్టర్ పరీక్షలు వెంటవెంటనే పెట్టాల్సి వస్తుందని, దీనివల్ల విద్యార్థులు పరీక్షలపై ఆసక్తి చూపలేరన్నారు. అదే విధంగా ప్రభుత్వం సింగిల్ మేజర్ పద్ధతి స్థానంలో డ్యూయల్ మేజర్ పద్ధతి తీసుకువస్తామని చెప్పి మళ్లీ సింగిల్ మేజర్ విధానాన్ని అమలు చేస్తామనడం భావ్యం కాదన్నారు. దీనివల్ల విద్యార్థులు మైనర్ సబ్జెక్టు తీసిన దానిపై పీజీ చేయడానికి అవకాశం ఉండడం లేదని, అంతే కాకుండా కొన్ని సబ్జెక్టులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్ర మేలుకుని డ్యూయల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం డీఆర్వో శ్రీనివాస మూర్తికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించకుంటే బుధవారం పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు పాల్గొన్నారు.

230 కిలోల గంజాయి సీజ్

• ఇద్దరు నిందితుల అరెస్టు
• పరారీలో మరో ముగ్గురు నిందితులు
• ఒడిశా నుంచి విశాఖకు రెండు కార్లలో గంజాయి అక్రమ రవాణా
• వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందల్



సీజ్‌చేసిన గంజాయితో పాటు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

విజయనగరం క్రైమ్:

ఒడిశా రాష్ట్రం పొట్టంగి నుంచి విశాఖకు రెండు కార్లలో తరలిస్తున్న 230 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. పెదమానాపురం పోలీసులు, ఈగల్ బృందానికి వచ్చిన కచ్చితమైన సమాచారంతో జిల్లాలోని దత్తిరాజేరు మండలం మానాపురం రైల్వే గేట్ సమీపంలో ఈ నెల 13న వాహన తనిఖీలు చేపట్టారు. రెండు కార్లలో 230 కిలోల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. పోలీసులను చూసి కార్లు విడిచిపెట్టి ముగ్గురు వ్యక్తులు పారిపోయారు. మిగిలిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి మండలం పదం పంచాయతీ జంగరాదకి చెందిన ఘాసిరాం హంతల్ (24), కొరాపుట్ జిల్లా సిమిలిగూడ మండలం దబాయిగూడ పంచాయతీ ఝులియగూడకి చెందిన కరన్ ఖిలో (24)లు పట్టుబడ్డారు. సురేష్, అదకాబీయా ఖనిలతి, జున్నేష్ పరారయ్యారు. నిందితుల నుంచి 44 ప్యాకెట్లలో ఉన్న గంజాయితో పాటు రూ.700ల నగదు, మూడు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. పరారైన మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నాం. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, గజపతినగరం సీఐ జీఏవీ రమణ, మానాపురం ఎస్సై ఆర్.జయంతి, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు. కానిస్టేబుల్స్ కె.అప్పన్న, కె.శంకర్, హెచ్‌సీ కె.అప్పలస్వామిలను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

రెగ్యులర్ కాదు.. రెన్యువల్ లేదు!

• సీఆర్‌టీల ఎదురుచూపు



సాక్షి, పార్వతీపురం మన్యం: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్‌టీలను ప్రభుత్వం నేటికీ రెగ్యులర్ చేయలేదు. మరోవైపు వారికి ఇంకా రెన్యువల్ ఉత్తర్వులు కూడా ఇవ్వలేదు. తమను రెగ్యులర్ చేయాలని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామికి సీఆర్‌టీలు వినతిపత్రం కూడా అందజేశారు. 2007లో ఉమ్మడి ఏపీలో 1,243 మంది సీఆర్‌టీలను జీఓ నంబర్ 59 ప్రకారం రెగ్యులర్ చేశారు. 18 ఏళ్లుగా సుమారు 729 మంది పని చేస్తున్నారు. మినిమం టైం స్కేల్ నిబంధనలు కూడా గురుకుల సొసైటీ అమలు చేయడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెన్యువల్ చేయడంలో తాత్సారం

మరోవైపు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలకు రెన్యువల్ ఉత్తర్వులు కూడా ఇవ్వలేదు. రాష్ట్ర అధికారుల నుంచి 20 రోజుల కిందటే ఉత్తర్వులు వచ్చినప్పటికీ.. జిల్లా అధికారులు తాత్సారం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐటీడీఏల పరిధిలో వీరంతా పని చేస్తున్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 55, సీతంపేట పరిధిలో 40 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 330 మందికిపైగా పని చేస్తున్నారు. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే వీరికి రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. విద్యాసంవత్సరం ప్రారంభమైనా నేటికీ ఇవ్వకపోవడంతో వారంతా ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నారు.

వెంటనే రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలి

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్‌టీలకు రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వడంలో తాత్సారం తగదు. రెండు నెలల నుంచి జీతాలూ లేక, వారంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కౌన్సెలింగ్ తేదీని ప్రకటించి, న్యాయం చేయాలి. లేకుంటే ఆందోళన చేపడతాం.
– మురళీమోహన్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు